క్లుప్తంగా

సుజనా గారడీలు చెల్లవు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ నియోజకర్గంలో బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి గారడీలు చెల్లవని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ అన్నారు. శుక్రవారం భవానీపురంలోని తన కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరికి పశ్చిమ నియోజకవర్గ ఎల్లలు తెలియవన్నారు. ఇక్కడ ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులని, సుజనా చౌదరి లాంటి వలస వాదులకు ఇక్కడ స్థానం ఉండదన్నారు. 1967 ఎన్నికల నుంచి ఈ నియోజకవర్గంలో పోటీచేసి గెలిచిన వాళ్లంతా స్థానికులేనని, వలస వాదులెవరూ లేరని స్పష్టం చేశారు. ఈ నియోజకవర్గంలో అభివృద్ధి లేదని, శ్వేత పత్రం విడుదల చేయాలంటున్న సుజనా చౌదరి బహిరంగ చర్చకు రాగలరా అని సవాల్ విసిరారు. అంతకంటే ముందు నేషనల్ లా ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై సుజనా ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ పేద ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి ఆసిఫ్‌కు అవకాశం కల్పించిందని, అతనిని చూసి సుజనా చౌదరి వణికిపోతున్నారన్నారు. ఆసిఫ్‌ను ఓడించడానికి నరేంద్ర మోదీ చేత నియోజకవర్గంలో రోడ్ షో చేయిస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

మైనార్టీలందరూ ఆసిఫ్‌కు మద్దతివ్వాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా షేక్ ఆసిఫ్ పోటీ చేస్తున్నారని, ఆయనకు సంపూర్ణ మద్దతు ప్రకటించి, పోటీలో ఉన్న మైనార్టీలు విత్‌డ్రా కావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ హసన్‌బాషా కోరారు. వించిపేటలోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు మస్తాన్, కాపు నాడు సంఘం పశ్చిమ అధ్యక్షులు కర్రి గౌరితో కలిసి ఆయన మాట్లాడారు. పశ్చిమ నియోజకవర్గంలో వివిధ వర్గాలు అనేక దశాబ్దాలుగా శాంతియుతంగా జీవిస్తున్నారన్నారు. మతాలు, కులాలకు అతీతంగా పశ్చిమ ప్రజానీకం సోదరుల్లా ముందుకు సాగుతున్నారని చెప్పారు. అటువంటి సహృద్భావ వాతావరణాన్ని దెబ్బతీసేందుకు సుజనాచౌదరి వంటి నేతలు ఇక్కడ పోటీ చేస్తున్నారని చెప్పారు. బీజేపీ వంటి మతోన్మాద శక్తులకు బుద్ధి చెప్పటానికి ముస్లిం వర్గాలన్నీ ఐక్యంగా ఉండాల్సిన అవసరముందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ పరిధిలోగల 11 కేవీ ఐఎంపీ ఫీడర్ విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ సీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పాల ఫ్యాక్టరీ ఏరియా, సయ్యద్ అప్పల స్వామి కాలేజి వెనుక ప్రాంతంలో కరెంట్ నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా ఊంజల్ సేవ



గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేం చేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజల్ సేవ కార్యక్రమం నిర్వహించారు. శ్రీసీతారాముల కల్యాణం జరిగి పదహారు రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో ఈ వేడుక జరిపారు. తొలుత స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాహచనం, విశేష అర్చనలు నిర్వహించారు. భక్తులచే శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, ద్వాదశ ప్రదక్షిణలు జరిపారు. అనంతరం భక్తుల గీతాలాపన మధ్య శ్రీసీతా రామచంద్ర స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన చేశారు. పలువురు పుర ప్రముఖులు, పరిసరా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

పోరంకిలో బంగారం, నగదు చోరీ

పెనమలూరు: పోరంకిలో చోరీ జరిగిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి గ్రామం నిడమానూరు రోడ్డుకు చెందిన ఎస్.వెంకటనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 19న హైదరాబాద్‌కు వెళ్లాడు. అయితే రెండు రోజుల క్రితం ఇంట్లో మొక్కలకు నీరు పోయటానికి వచ్చిన బంధువు ఇంటి తలుపు తాళం పగులగొట్టి ఉండటంతో వెంటనే వెంకటనారాయణకు సమాచారం ఇచ్చాడు. దీంతో వెంకటనారాయణ హైదరాబాద్ నుంచి వచ్చి ఇంట్లో పరిశీలించగా రూ.40 వేలు, బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు గుర్తించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ముస్లింల రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్ర

- పశ్చిమంలోనూ విద్వేషాలు సృష్టించేందుకు బీజేపీ పన్నాగాలు
- ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఆసిఫ్ తదితరులు



చిరు వ్యాపారి దుకాణంలో పునుగులు వేస్తున్న ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బీజేపీ పాలనంతా స్కామ్‌లేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ ఆరోపించారు. స్కామ్‌లతో ఎదిగి నేడు పశ్చిమంలో పోటీ చేస్తున్న బీజేపీ నాయకులను తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. 54వ డివిజన్ కార్పొరేటర్ అర్షద్ ఆధ్వర్యంలో షేక్ ఆసిఫ్ శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ ఇంటింటికీ వెళ్లి రానున్న కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి అండగా ఉండాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ ముందుకు సాగారు. ప్రతి ఒక్కరూ ఆసిఫ్‌కు మద్దతు పలుకుతూ రానున్న ఎన్నికల్లో అండగా ఉంటామని పేర్కొన్నారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో మతోన్మాదాన్ని సృష్టించి విభేదాల ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. అంతేకాకుండా దేశంలోనే అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్న ముస్లింలకు దివంగత మహానేత నాలుగు శాతం రిజర్వేషన్లను కల్పించారన్నారు. ఆ రిజర్వేషన్లతో ఇప్పుడిప్పుడే ముస్లింలలోని అట్టడుగు వర్గాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయన్నారు. అటువంటి రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తామని బహిరంగంగానే చెబుతోందన్నారు. వారికి ఓటు వేయటమంటే రిజర్వేషన్ల రద్దుకు మద్దతు పలకటమేనన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ జమలపూర్ణమ్మ, కార్పొరేటర్లు అర్షద్, యలకల చలపతిరావు, నాయకులు అతీక్, ఇమామ్‌ఖాన్; ఖాదర్, శబాషీ, యునస్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమమే మా అస్త్రం..

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే పశ్చిమ నియోజకవర్గంలో తనను గెలిపిస్తాయని ఆ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం 35వ డివిజన్ పూర్ణానందపేటలో స్థానిక కార్పొరేటర్ బలసాని మనిమ్మతో కలిసి ఆయన పర్యటించారు. గడప గడపకూ వెళ్లి స్థానికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ డివిజన్‌లో కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి వీధిలో సీసీ రోడ్లు, తాగు నీటి పైపులైన్‌లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పేదలందరికీ ఇళ్ల పట్టాలను అందించామన్నారు. కోట్లకు పడగలెత్తిన వ్యక్తిని పశ్చిమ నియోజకవర్గం ఎన్నికల బరిలో దించి గెలవాలన్న టీడీపీ, జనసేన, బీజేపీల ఆశలకు నియోజకవర్గ ప్రజలు వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటుతో నీళ్ల చల్లుతారని తెలిపారు.

నియోజకవర్గంలో ఎక్కువ శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ప్రజలు వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారన్నారు. ఒక సామాన్య కార్యకర్తనైన తనపై నమ్మకంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని ఆయన నమ్మకాన్ని వమ్ము ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ యలకల చలపతిరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు, నగర అధ్యక్షుడు బూదాల శ్రీను, స్థానిక నాయకులు సంగీత్‌బాబు, సుజాత దాస్, శివ, బాబు, కలిమి, సాగర్, సంజయ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి తోటి విద్యార్థుల ఆర్థిక సాయం



సిద్ధికకు ఆర్థిక సాయం అందజేస్తున్న డైరెక్టర్ సూర్యారావు, ఉపాధ్యాయులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి ఆపరేషన్ నిమిత్తం తోటి విద్యార్థులు రూ. 50 వేలు ఆర్థిక సాయాన్ని అందించిన ఘటన చిట్టినగర్‌లో చోటు చేసుకుంది. చిట్టినగర్ శ్రీగౌతమ్ స్కూల్‌లో రోమియా సిద్ధిక రెండో తరగతి చదువుతోంది. సిద్ధికకు గత కొంత కాలంగా గాల్ బ్లాడర్‌లో రాళ్లు ఉండటంతో తీవ్రంగా ఇబ్బందులకు గురవుతోంది. ఆపరేషన్‌కు ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైంది. దీంతో సిద్ధికతో చదువుతున్న చిన్నారులతో పాటు స్కూల్‌లోని విద్యార్థులందరూ తమకు తోచిన రీతిలో డబ్బులు పోగు చేసి డైరెక్టర్ నల్లాని సూర్యారావుకు అందజేశారు. శుక్రవారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు పోగు చేసిన మొత్తంలో మరి కొంత మొత్తాన్ని కలిపి రూ. 50వేలను సిద్ధిక తల్లి జమీనాకు అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ తులసీ, శ్రీరామ్, మధులత, ఉమా, రేష్మ, సునీత, రమా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రైడేను ప్రతి ఒక్కరూ పాటించాలి



నీటి తొట్టెల్లో పెరుగుతున్న లార్వాను చూపుతున్న మలేరియా అధికారులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రతి శుక్రవారం డ్రైడేగా ప్రతి ఒక్కరూ పాటించడంతో పాటు ఇంటి పరిసరాల్లో ఉన్న నీటి తొట్టెలను శుభ్రం చేసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సుబ్బారావు పేర్కొన్నారు. 56వ డివిజన్ పరిధిలోని 35 గజాలు, పాత రాజరాజేశ్వరిపేట పరిసరాల్లో శుక్రవారం డ్రైడేను నిర్వహించారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ ఎస్.రాంబాబు పర్యవేక్షణలో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు నీటిని నిల్వ చేసే తొట్టెలు, ప్లాస్టిక్ డబ్బాలను పరిశీలించారు. నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా వృద్ధి చెందడంతో లార్వా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వారంలో ఒక రోజు నీటిని నిల్వ చేసే డబ్బాలు, తొట్టెలను కడిగి శుభ్రం చేసుకోవడంతో పాటు ఎండలో ఒక రోజు పూర్తిగా తడి ఆరేలా ఉంచాలన్నారు. కల్వర్టు కింద దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్, శానిటరీ సెక్రటరీలు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

నున్న చెక్‌పోస్టులో ముమ్మరంగా తనిఖీలు



నున్న(విజయవాడరూరల్): ఎన్నికల నేపథ్యంలో నున్న గ్రామంలోని పవర్‌గ్రిడ్ వద్ద చెక్‌పోస్టులో తనిఖీలను అధికారులు ముమ్మరం చేశారు. విజయవాడ వైపు నుంచి నూజివీడు, అలాగే సత్తుపల్లి, విసన్నపేట, ఏలూరు ప్రాంతాల నుంచి విజయవాడ వైపు రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులతో పాటు అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నారు. బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులను పరిశీలిస్తున్నారు. మూడు రోజుల క్రితం తెలంగాణకు చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి నుంచి రూ.4.50 లక్షలను ఆర్టీసీ బస్సులో పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ప్రతి ఆర్టీసీ బస్సును తనిఖీ చేస్తున్నారు. 24/7 పోలీసులు, ప్రత్యేక అధికారుల బృందం వాహనాలను తనిఖీ చేస్తున్నట్టు నున్న పోలీసు స్టేషన్ సీఐ ఎస్.దుర్గాప్రసాద్ తెలిపారు.

మహిళా సాధికారత జగనన్నతోనే సాధ్యం

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని కుమార్తె శ్వేత



ప్రచారంలో బాగంగా డివిజన్‌లోని మహిళలతో కేశినేని శ్వేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంటి ఇల్లాలు బాగుంటే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని, అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో ఒక్క రైతు భరోసా మినహా మిగిలిన అన్ని పథకాలు మహిళల పేరుతోనే ఇస్తున్నారని విజయవాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) కుమార్తె కేశినేని శ్వేత అన్నారు. మహిళా సాధికారత అనేది సీఎం జగనన్నతోనే సాధ్యం అయ్యిందని తెలిపారు. ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ గెలుపును కాంక్షిస్తూ ఆమె 55వ డివిజన్‌లో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి స్థానికులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని, ఇది చారిత్రక అవసరమని పేర్కొన్నారు. ఇక అభివృద్ధి విషయానికి వస్తే సీఎం జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే విజయవాడ నగరం, ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని తెలిపారు.

సొంత ఇంటి కల నెరవేర్చిన జగనన్న..

పేద ప్రజలలో ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు ఉండాలన్నది వారి కల అని, వారి కలలను సాకారం చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని కేశినేని శ్వేత పేర్కొన్నారు. ఆ ఇంటితోపాటు అమ్మ ఒడి, జగనన్న ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం వంటి పలు సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరు మీద ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. స్థానిక కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణ చంద్రరావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పిచ్చుకల సంరక్షణపై యువత దృష్టిపెట్టాలి



దాలినాయుడును సత్కరించిన సిద్ధార్థ కళాశాల అధ్యాపకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పిచ్చుకల సంరక్షణపై యువత దృష్టి పెట్టాలని విశాఖపట్నానికి చెందిన హరిత వికాష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పొలుపర్తి దాలినాయుడు అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో పిచ్చుకల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. దాలినాయుడు మాట్లాడుతూ జీవ వైవిధ్యంలో పిచ్చుకల పాత్ర చాలా ప్రధానమైన దని చెప్పారు. పెరుగుతున్న నగరీకరణ, సెల్‌ఫోన్ టవర్ల నుంచి వెలువడే రేడియేషన్ ప్రభావం వల్ల వాటి సంతతి క్రమంగా అంతరించిపోతుందన్నారు. పిచ్చుకలను కాపాడుకోవాల్సిన అవసరం మనుషులకు చాలా ఉందన్నారు. పిచుకల సంరక్షణ కోసం అవకాశం ఉన్న చోట వరి కంకులు ఉంచాలని సూచించారు. అనంతరం కళాశాల ఆవరణలో ఉన్న సరస్వతి మందిరం దగ్గర, ఉద్యానవంలో ఉన్న చెట్ల కొమ్మలకు వరి కంకులను విద్యార్థులు కట్టారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్ అధ్యాపకులు కలిసి దాలినాయుడును సత్కరించారు. సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థి సుంకర నాగభూషణం, సిద్ధార్థ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి గీతామందిర వార్షికోత్సవం



పెనమలూరు: కానూరులో శుక్రవారం సాయి గీతా మందిరం 26వ వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున 5.15 గంటలకు కాగడా హారతి, 6.10 గంటలకు 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం, ఉదయం 8.30 గంటలకు పల్లకీపూజ, అనంతరం మల్లెలార్చన, మధ్యాహ్నం 12 గంటలకు హారతి బాబాకు ఇచ్చారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ వెంకటేశ్వరరావు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు షిర్డిసాయి బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఐదు వేల మంది భక్తులను అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంచుకోవాలి



కేసం వేణుని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం ఇండస్ట్రీయల్ ప్రామోషన్ ఆఫీసర్ వేణు కేసం అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈడీసీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఐపీఆర్ డేను పురస్కరించుకొని మేధో సంపత్తి హక్కులపై అవగాహన సదస్సును ఆ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు కేసం మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కుల ద్వారా దేశానికి అద్భుతమైన ఆదాయం లభిస్తుందన్నారు. మేధో సంపత్తి హక్కులపై సరైన అవగాహన లేకపోవటం వల్ల చాలా మంది మంచి ఆదాయాన్ని కోల్పోతున్నారన్నారు. వీటిపై విద్యార్థులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవటం ద్వారా విస్తృతమైన ఉపాధి అవకాశాలను పొందవచ్చని వివరించారు.

కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఏ రమాదేవి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి. విజయదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పార్టీకి గుడ్ బై చెప్పిన పీసీసీ కార్యదర్శి



రాజీనామా చూపుతున్న పోతిన బేసుకంఠేశ్వరుడు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, సర్దార్ మరుపిళ్ల చిట్టి కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం అధ్యక్షుడు పోతిన బేసికంఠేశ్వరుడు తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని పార్టీ అధిష్టానికి పంపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయవాడలోని సర్దార్ మరుపిళ్ల చిట్టి కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దార్ మరుపిళ్ల చిట్టి కాంగ్రెస్ కేంద్ర కార్యాలయాన్ని 1935లో నాటి స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే మరుపిళ్ల చిట్టి వంటి మహనీయులు ప్రారంభించారన్నారు. జిల్లాలో మొదటి కాంగ్రెస్ కార్యాలయమన్నారు. అప్పటి నుంచి పలు తరాలుగా కాంగ్రెస్ పార్టీని ఇక్కడ కాపాడుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. అయితే ఇటీవల కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలు, ముందుకు సాగుతున్న తీరు గందరగోళంగా ఉందన్నారు. కార్యకర్తలను, నాయకులను అడిగి ఏ నిర్ణయం చేయటం లేదన్నారు. ప్రధానంగా ప్రస్తుత పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన కుటుంబ గొడవలను పార్టీకి ముడిపెట్టి నాయకులను, కార్యకర్తలను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో 40 ఏళ్లుగా పార్టీలో చురుకైన పాత్ర పోషించిన తన లాంటి ఎందరో నాయకులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దాంతో పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. సమావేశంలో పార్టీ నగర ప్రధాన కార్యదర్శి పైలా బాల శ్రీనివాసరావు, సీనియర్ నేత పణుకు రమేష్‌లు ఉన్నారు.

సీఆర్పీఎఫ్ బలగాలతో కవాతు



రామవరప్పాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని రాజుల బజారు, కాపుల బజారు, బల్లెంవారి వీధిల్లో శుక్రవారం పటమట పోలీస్‌స్టేషన్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సెంట్రల్ ఏసీపీ భాస్కర్‌రావు నేతృత్వంలో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం కవాతును చేపట్టారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటును వినియోగించుకోవాలని అవగాహన పరుస్తూ, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మేమున్నామన్న భరోసా కల్పిస్తూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పటమట సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నున్నలో ఫ్లాగ్‌మార్చ్

నున్న(విజయవాడరూరల్): ప్రజలు తమ ఓటును నిర్భయంగా వేయాలని ప్రజలకు పోలీసులు భరోసానిస్తూ శుక్రవారం నున్న గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి రామకృష్ణ ఆదేశాల మేరకు నున్న గ్రామంలో లైబ్రరీసెంటర్, పడమర బజారు, గౌడబజారు, కుమ్మరిబజారు, కోటకట్ట సెంటర్, వికాస్ కాలేజీ రోడ్డు, బోడపాడు పరిసర ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. రాజకీయ పార్టీల ఒత్తిళ్లకు భయపడకుండా ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం చేశారు. నున్న పోలీసు స్టేషన్ సీఐ ఎస్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఈ నెల 27 నుంచి జూన్ ఏడో తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో చిన్నారులకు పుస్తక పఠనం, కథ చెప్పించడం, చదివించడం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్(క్రాఫ్ట్), డ్రామా, స్పోకెన్ ఇంగ్లీష్, కవితలు, సులువుగా గణితం నేర్పించడం, సంగీతం, డాన్స్, భగవద్గీత శ్లోకాలు, చదరంగం, క్యారమ్స్, యోగా వంటి అంశాల్లో నిపుణులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

29న మండల పరిషత్ సమావేశం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

ఉచిత వేసవి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యాన దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో మే 2వ తేదీ నుంచి నిర్వహించనున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు వెస్టన్, ఫోక్ డాన్స్, డ్రాయింగ్, కేలియోగ్రఫీ, క్రాఫ్ట్ వర్క్, క్లే వర్క్, యోగ, భరతనాట్యం తదితర అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మరింత సమాచారం కోసం 8247500651లో సంప్రదించాల్సిందిగా కోరారు.

రమాశంకర్ సామాజిక సేవలు వెలకట్టలేనివి



విజయవాడకల్చరల్: సినీ దర్శకుడు, నిర్మాత, ఓమ్మి రమాశంకర్ సామాజిక సేవలు వెలకట్టలేనివని సీనియర్ పోలీస్ అధికారి కె. డేవిడ్‌రాజు అన్నారు. సింధూ కల్చరల్ అండ్ ఈవెంట్స్, మురగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం రమాశంకర్ జయంతి, సినీ సంగీత విభావరి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజు మాట్లాడుతూ రమాశంకర్ తన ట్రస్ట్ ద్వారా ఎందరో వికలాంగులకు ట్రై సైకిల్స్ అందించినట్లు తెలిపారు. సింధూ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకురాలు సింధూ మాట్లాడుతూ రమాశంకర్ ఎందరో నూతన గాయనీ గాయకులకు అవకాశం కల్పించారని చెప్పారు. పేద కళాకారులకు సహాయం చేసేవారని అన్నారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు మానేపల్లి జోషి, బీవీ వీరభద్రరావు, మాంతి రమణ, శ్యాం ప్రసాద్, రూపాశ్రీ తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు చిత్రాల్లోని పాటలను ఆలపించారు. రమాశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.